ప్రజాశక్తి
ఆదివారం 15 డిసెంబర్ 2024 5 విజయనగరం



రైస్‌మిల్లుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-గజపతినగరం, గంట్యాడ

పలు రైస్‌మిల్లలను జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ధాన్యం తూకం, అన్ లోడింగ్‌పై ఆరాతీశారు. ముందుగా గంట్యాడ మండలంలోని శ్రీనివాస, కనకదుర్గ రైస్‌మిల్లులను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. తూకం విషయంలో ఆ మిల్లులపై వచ్చిన ఆరోపణపై ప్రశ్నించారు. అన్‌లోడింగ్‌పై ఆరాతీశారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మురపాక రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గజపతినగరం మండలంలో వాసవి రైస్‌మిల్లును కూడా జెసి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ట్రక్ షీట్లు పెండింగ్ లేకుండా చూడాలని జెసి ఆదేశించారు. ఈ పర్యటనలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ మీనా కుమారి, ఆయా మండలాల తహశీల్దార్లు, డిటిలు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

దోపిడీలో దొందూ దొందే

- ఎప్పటిలాగే అదనపు కిలోలు డిమాండ్
- క్వింటాకు 3 నుంచి 5 కిలోలు వసూలు
- మిల్లర్ల అక్రమాలపై ఉదాసీనత
- గత అక్రమాలపై చర్యలకు వెనుకడుగు

గంట్యాడ మండలం పెదమజ్జిపాలెం గ్రామానికి చెందిన రైతు సాగి వరహాల రాజు బొండపల్లి మండలం వెదురువాడ రెవెన్యూ పరిధిలో రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యం పరీక్షించారు. 14 శాతం తేమతో గొట్లాంలోని శ్రీమహాలక్ష్మి రైస్‌మిల్లుకు సొంత వాహనం ద్వారా 115 బస్తాలను తీసుకెళ్లారు. అక్కడ మిల్లు సిబ్బంది 40 కిలోలకు బదులు 41.50 కిలోలు, హిల్‌డింగ్ తక్కువ వచ్చిందంటూ మరొక కిలో అదనంగా మొత్తం.. 42.50 కిలోలు ఇస్తే దించుతామని డిమాండ్ చేసి, వాహనాన్ని నిలిపేశారు.

ఒక్క మహాలక్ష్మి మిల్లు మాత్రమే కాదు. జిల్లాలో అత్యధిక మిల్లర్లు రైతుల నుంచి క్వింటాకు 3 కిలోల నుంచి 5 కిలోలు అదనంగా డిమాండ్ చేస్తూ దోచుకుంటున్నారు. వాహన నిలుపుదలతో అదనపు ఛార్జీలు వాహనదారులకు ఇవ్వాల్సి వస్తుండటంతో గత్యంతరం లేక అంగీకరించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఎపి రైతు సంఘం నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

మిల్లు యాజమాన్యం నిలిపేసిన ధాన్యం లోడు

ప్రజాశక్తి- జామి, గంట్యాడ

జిల్లాలో సుమారు ఈ ఏడాది సుమారు 2.35 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. గతం కన్నా భారీ స్థాయిలో పంట పండింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కానీ తుపాన్ల హెచ్చరికల భయంతో అత్యధికంగా రైతులు ధాన్యాన్ని దళారులకే ఎక్కువ అప్పగించిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోవైపు ప్రభుత్వం గత పరిణామాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకున్నట్లు చెబుతున్నా, అధికార యంత్రాంగంలో మాత్రం కొంత ఉదాసీనత కనిపిస్తోందని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గతం కన్నా చెల్లింపుల విషయంలో కూటమి ప్రభుత్వం మెరుగ్గా ఉన్నప్పటికీ అదనపు ధాన్యం డిమాండ్ చేయడంలో మార్పు లేదని రైతులు చెబుతున్నారు. దీనిపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.

మిల్లర్లపై ఎందుకీ ఉదాసీనత?

అదనపు కిలోలు తీసుకుంటున్నారని 2022లో 12 మంది రైతుల ఫిర్యాదు మేరకు అప్పటి జాయింట్ కలెక్టర్.. మిల్లులపై చర్యల్లో భాగంగా నాలుగు మిల్లులకు రూ.50 వేలు చొప్పున జరిమానాలు విధించారు. కానీ, నేటికీ వాటిపై చర్యలు లేవు. ఇందులో జిల్లా మంత్రికి చెందిన మిల్లు ఉండటంతోనే చర్యలకు వెనుకాడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 2023లో జామి, గంట్యాడ మండలాల రైతులు, రైతు సంఘం ఆధ్వర్యంలో మిల్లర్ల దోపిడీపై ఫిర్యాదుచేశారు. విచారణ పూర్తయి, ఏడాది దాటుతున్నా, మళ్లీ కొనుగోలు జరుగుతున్నా ఇప్పటికీ ప్రస్తుత జాయింట్ కలెక్టర్ చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలోనే మిల్లర్లు రైతుల నుంచి అదనపు ధాన్యాన్ని గుంజుకోవాలన్న పరంపరను కొనసాగిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం ఒక్క కేజీ కూడా అదనంగా తీసుకోవద్దని చెబుతున్నా, మిల్లర్లు మాత్రం హీల్డింగు రాలేదని, ధాన్యం నాణ్యత పేరుతో అదనంగా గుంజుతున్న ఉదంతాలు బయటపడుతున్నాయి. మిల్లర్లపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటే తప్ప రైతులపై మిల్లర్ల దోపిడీ నిరోధించలేరని అంతా అంటున్నారు.

అక్రమాలపై చర్యలేవీ..?

ఈసారి కూడా రైతుల నుంచి మిల్లర్లు అదనపు ధాన్యాన్ని బాహాటంగానే వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం మారినా, దోపిడీ మాత్రం ఆగడం లేదు. రైతులు ఫిర్యాదు చేస్తే తప్ప మిల్లర్ల లూటీపై ఈ ఒక్క అధికారి మాట్లాడటం లేదు. పోనీ గత ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటారా? అంటే అదీ లేదు. ఇప్పటికైనా మిల్లర్ల వ్యవహారంపై అధికారులే నేరుగా దాడులు నిర్వహించి, దోపిడీని ఆపాలి. లేకుంటే ఎప్పటిలాగే రైతులను సమీకరించి, మిల్లర్ల దోపిడీపై తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తాం.

– బుద్దరాజు రాంబాబు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

సార్వత్రిక ఎన్నికల ముందు 'బాదుడే బాదుడు..' అంటూ గగ్గోలు పెట్టిన కూటమి పాలకులు.. ఆర్నెల్లు గడవక ముందే ప్రజల నడ్డివిరిచారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని ప్రకటించి.. గద్దెనెక్కిన ఆరు నెలల్లోపే రెండు సార్లు విద్యుత్తు బాంబులు పేల్చేసింది. పెంచిన ట్రూఅప్ ఛార్జీల భారంతో సామాన్యులు బెంబేలెత్తిపోయే పరిస్థితి తెచ్చింది. విద్యుత్తు వినియోగపు ఛార్జీల కంటే అదనపు బాదుడే అధికమైందంటూ షాక్ తినడం జనం వంతైంది. పెంచిన విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది.

బిల్లు.. గుండె గుబేల్

శ్రీనివాసరావుకు వచ్చిన బిల్లులు

- ట్రూఅప్ ఛార్జీల బాదుడుతో సామాన్యుల బెంబేలు
- విద్యుత్తు వినియోగం తగ్గినా పెరిగిన బిల్లులు
- ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మున్సిపాలిటీలోని పాకివీధిలో నివాసముంటున్న జె.శ్రీనివాసరావు పేరుతో 122111P001011309 సర్వీస్ నంబర్‌తో విద్యుత్తు మీటర్ ఉంది. ఈ ఏడాది సెప్టెంబర్ నాలుగో తేది నుంచి అక్టోబర్ 6 వరకు 196 యూనిట్ల విద్యుత్తు వినియోగిస్తే బిల్లు రూ.1019.53 వచ్చింది. తర్వాత నెల అక్టోబర్ ఆరో తేది నుంచి నవంబర్ 4 వరకు 183 యూనిట్ల విద్యుత్తు వినియోగిస్తే రూ.1952.77 బిల్లు వచ్చింది. ముందు నెల కంటే తర్వాత విద్యుత్తు వినియోగం 13 యూనిట్లు తగ్గినప్పటికీ బిల్లు మాత్రం రూ.933.24 ఎక్కువ రావడంతో శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు వినియోగం తగ్గితే బిల్లు తగ్గకుండా ఎలా పెరుగుతుందని వినియోగదారుని కుటుంబ సభ్యురాలు బి.సురేఖ ప్రశ్నిస్తున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్తు ట్రూఅప్ ఛార్జీలు సామాన్యులపై పెనుభారంగా మారాయని సామాన్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెంచిన విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

బిల్లు పెరిగిందంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్న సురేఖ

వాడకం తగ్గించినా బిల్లుల మోత

బిల్లు చూపిస్తున్న నీలవేణి

పాకివీధికి చెందిన సోము పాలమ్మకు 122111P001006177 సర్వీస్ నెంబర్‌తో విద్యుత్తు మీటర్ ఉంది. ఇంటిలో ఎసి, వాషింగ్ మిషన్, ఫ్యాన్లు, లైట్లు ఉన్నప్పటికీ శీతాకాలం కావడంతో ఎసి పూర్తిగా వాడడం లేదు. ఫ్యాన్లు వినియోగం కూడా బాగా తగ్గింది. వేసవిలో ఎసితో పాటు ఫ్యాన్లు, వాషింగ్ మిషన్, లైట్లకు విద్యుత్తు వాడినప్పటికీ నెలకు రూ.3 వేలకు మించి బిల్లు రాలేదు. శీతాకాలంలో ఎసిని పూర్తిగా ఆన్ చేయకుండా, ఫ్యాన్లు వినియోగం తగ్గించినా బిల్లు తగ్గలేదని సోము పాలమ్మ కుటుంబ సభ్యురాలు బి.నీలవేణి ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ నాలుగో తేది నుంచి అక్టోబర్ 6 వరకు 385 యూనిట్లు వినియోగించంతో రూ.2644.86 బిల్లు వచ్చింది. తర్వాత నెల విదుత్తు వినియోగం పెరగకున్నా 810 యూనిట్లు విద్యుత్తు వాడినట్లు బిల్లులో చూపించి రూ.6,785.21 బిల్లు కట్టమంటున్నారని నీలవేణి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్తు బిల్లులో తప్పులను సరి చేసి పెంచిన విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఆదాయం పెరగలేదు.. బిల్లులు పెంచారు

సామాన్యుల ఆదాయం పెరగక పోయినా విద్యుత్తు బిల్లులు పెంచి భారాలు వేస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో జీవనానికి ఇబ్బందులు పడుతుంటే విద్యుత్తు ఛార్జీలు పెంచడం సరికాదు. పెరుగుతున్న ధరలు, ఛార్జీలకు అనుగుణంగా ఆదాయం పెరగక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. పెంచిన విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలి.

– జె.సీత, బొబ్బిలి

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం

- పరిశీలించిన జెసి సేతు మాధవన్
- 21 చోట్ల వాయిదా

విజయనగరంకోట.. ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న జెసి మాధవన్

రేగిడి మండలం ఖండ్యాం గ్రామంలో నీటి సంఘం ఎన్నికల్లో వాగ్వివాదానికి దిగిన మద్దతుదారులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా, ప్రశాంతంగా పూర్తి చేసేందుకు జెసి ఇంతకుముందే పలు సూచనలు జారీ చేశారు. అంతేకాకుండా ఆయన స్వయంగా విజయనగరం మండలంలోని ద్వారపూడి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. తహశీల్దార్ కూర్మనాథరావు, ఇరిగేషన్ అధికారులు అక్కడి పరిస్థితి గురించి జెసికి వివరించారు. సాగునీటి సంఘాల ఎన్నికల జిల్లా నోడల్ అధికారి, ఇరిగేషన్ ఇఇ ఎం.వెంకటరమణ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. జిల్లాలోని మొత్తం 398 సంఘాలకు గాను 377 సంఘాలకు ఎన్నికలు పూర్తయ్యాయి. 21 సంఘాల ఎన్నిక వివిధ కారణాల వల్ల వాయిదా పడింది. టిసి సభ్యులకు 2544 స్థానాలకు గాను 134 స్థానాలకు ఎన్నిక వాయిదా పడింది. గెలుపొందిన సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

గందరగోళంతో నిలిచిన ఎన్నిక

జామి మండలంలో సాగునీటి సంఘం ఎన్నికల్లో గందరగోళం నెలకొంది. జామి, చింతాడ గ్రామాల్లో టిడిపి, వైసిపి నాయకుల మధ్య వివాదం చోటుచేసుకోవడంతో ఎన్నికలు నిలిచిపోయాయి. శాసనపల్లిలోనూ ఎన్నికల ప్రక్రియ ఆపేశారు. అధికార పార్టీ ఒత్తిళ్ల వల్ల ఎన్నికలు నిలిచిపోయాయని ప్రతిపక్ష పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. ● వేపాడ మండలంలో వల్లంపూడి, నల్లబెల్లి, కెజెపూడి గ్రామాల్లో అధికార పార్టీలో గ్రూపు తగాదాల వల్ల ఎన్నికలు నిలిచిపోయాయి.

ఖండ్యాంలో వాగ్వివాదం

రేగిడి మండలం ఖండ్యాంలో పాలవలస ప్రసాద్, ఎర్నేన రామినాయుడు మద్దతుదారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎస్ఐ నీలావతి సిబ్బందితో అక్కడికి చేరుకొని వారిని చెదరగొట్టారు. అనంతరం పోలింగ్ నిర్వహించగా వైసిపి, జనసేన మద్దతుదారులతో మూడు ఓట్ల తేడాతో పాలవలస ప్రసాద్ విజయం సాధించారు. టిడిపి నాయకులు దూబ ధర్మారావు , కె.మహేశ్వరరావు రీకౌంటింగ్‌కు డిమాండ్ చేసినా, ఫలితం లేకపోయింది.

ఆయాను విధుల్లోకి తీసుకోకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు లక్ష్మి

దీక్షా శిబిరంలో కూర్చున్న సిఐటియు, అంగన్వాడీ యూనియన్ నాయకులు, బాధిత అంగన్వాడీ హెల్పర్ సౌజన్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గజపతినగరం ప్రాజెక్టు పరిధిలో అక్రమంగా తొలగించిన అంగన్వాడీ హెల్పర్ ఎం.సౌజన్యను విధుల్లోకి తక్షణమే తీసుకోవాలని, లేకుంటే ఈ నెల 16న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి హెచ్చరించారు. అంగన్వాడీ హెల్పర్ సౌజన్యను విధుల్లోకి తీసుకోవాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం ఆరో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ రాజకీయ వేధింపుల్లో భాగంగానే సౌజన్యని తొలగించారని తెలిపారు. సౌజన్యకు ఉద్యోగం వచ్చేవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఐసిడిఎస్ పీడీ, సిడిపిఒపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీక్షల్లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఉపాధ్యక్షులు టి.వి.రమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, గరివిడి మైన్స్ కార్యదర్శి పి.అప్పలనాయుడు, ఎం.రమణ, వై.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు పొదుపు వారోత్సవాలు ప్రారంభం

ఇంధన పొదుపుతోనే ఆరోగ్యకర సమాజం : ఎస్ఇ లక్ష్మణరావు

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఇ లక్ష్మణరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంధన పొదుపు పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని ఎపి ఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు తెలిపారు. శనివారం విద్యుత్తు పొదుపు వారోత్సవాల సందర్భంగా కలెక్టరేట్ వద్ద ఆయన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన, విద్యుత్తు పొదుపు పాటించడం మన బాధ్యతగా ప్రజలు గుర్తించాలన్నారు. పెరుగుతున్న ప్రజల సంఖ్య, అవసరాలకు అనుగుణంగా ఇంధన పొదుపు చాలా అవసరమన్నారు. వారం రోజుల పాటు పొదుపు వారోత్సవాలు పేరుతో వివిధ రూపాల్లో కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అవగాహన ర్యాలీ పోలీస్ బ్యారెక్స్, ఆర్అండ్‌బి, ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా బాలాజీ జంక్షన్ వరకు సాగింది. కార్యక్రమంలో ఇంధన పొదుపు పాటించడం ద్వారా కలిగే ప్రయోజనాలు తెలిపే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఇ త్రినాథరావు, రూరల్ ఇఇ సురేష్‌కుమార్, విద్యుత్తు శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీతంలో ఘనంగా ఎనర్జీ కన్సర్వేషన్ డే

విజయనగరం : సీతంలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎనర్జీ కన్సర్వేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఇఇఇ బ్రాంచి విద్యార్థులు మూడు గ్రూపులుగా ఏర్పడి ఎనర్జీ వినియోగం ఎలా తగ్గించాలి, ఎనర్జీ సోర్సెస్, ఇంధనం ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్తు వినియోగాన్ని తగ్గించడం, సోలార్, విండ్ , టైడల్ ఎనర్జీ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేసి వాటిని వినియోగించడం ద్వారా ఎలా కాలుష్యం తగ్గించవచ్చు, కరెంటు బిల్లు తగ్గించడానికి చేయాల్సిన పనులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు, ప్రిన్సిపల్ డి.వి.రామమూర్తి, ఇఇఇ విభాగాధిపతి, డీన్ వై.నారేంద్రకుమార్, ఎనర్జీ క్లబ్ కో ఆర్డినేటర్ టి.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళిక విడుదల

విజయనగరం టౌన్ : జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వార్షిక ప్రణాళికను శనివారం జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమ నాయకులు జయంతి రామలక్ష్మణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, అధ్యక్షులు కె.ఎర్నాయుడు మాట్లాడుతూ సంఘం కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలను కలుపుకుని వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నాలుగెస్సుల రాజు, ఉపాధ్యక్షులు కె.దయానంద్, ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న, సాహితీ వేత్తలు డాక్టర్ జక్కు రామకృష్ణ, జి.ఎస్.చలం, విజయేశ్వరరావు, బి.సూర్యలక్ష్మి, కంది మూర్తి, సుభద్రాదేవి, అర్నేపల్లి సింహాచలం, చుక్కా సాయిరెడ్డి, వాకర్స్ క్లబ్ సభ్యులు కర్రోతు సత్యం, శ్రీరామూర్తి, శ్రీనివాసరెడ్డి, ఆదినారాయణ, కొల్లి సత్యం, విశ్వనాథం, ఆంజనేయరాజు పాల్గొన్నారు.

నూతన గాయకులకు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరంకోట

నూతన గాయనీ గాయకులకు ఈ నెల 16న ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సినీగేయ రచయిత వరంగల్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం నగరంలోని ఒక ప్రయివేట్ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 243 చరణాలతో రచించిన నూరేళ్ల నా ఊరు.. గేయ కావ్యాన్ని 243 మంది గాయని, గాయకులతో పాడించనున్నట్లు తెలిపారు. అందుకోసం నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు సమీపంలో ఉన్న హోటల్ కొండపల్లి గ్రాండ్ హాల్లో ఈ నెల 16న ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం పెద్దఎత్తున ఆవిష్కరణ కార్యక్రమం, పాట ప్రదర్శన ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో రచయిత ఎస్‌వి మల్లిక్ తేజ, గూడూరి మహేష్, జానకి రావు, తిరుపతి, శివకుమార్, శివ దుర్గ ప్రసాద్ తదితులు పాల్గొన్నారు.

పాడైన వాహనాలు వినియోగంలోకి.. కమిషనర్ నల్లనయ్య

పాడైన వాహనాలను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారిశుధ్య నిర్వహణ నిమిత్తం వినియోగిస్తున్న వాహనాలకు మరమ్మతులను చేపట్టేందుకు ప్రత్యేకమైన విధానాన్ని రూపొందించనున్నామని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. శనివారం నగరంలోని మేదరవీధి ప్రాంతంలో ఉన్న వెహికల్ డిపోను డిఇ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. అక్కడ మరమ్మతులకు గురైన వాహనాలు ఎక్కువగా ఉండడాన్ని గమనించారు. వాటిని సరి చేసేందుకు ప్రత్యేకమైన మెకానిక్‌ను ఏర్పాటు చేసి, వెల్డింగ్ మిషన్, ఇతర యంత్రాలు సమకూర్చి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసేలా ఒక విధానాన్ని అమలు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ పారిశుధ్య నిర్వహణ ఏ విధంగా ఉందో గమనించారు. కొన్నిచోట్ల రహదారులు ఆక్రమించి బడ్డీలు ఉండడానికి చూసి, వాటిని వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన గుంతల పూడ్చివేత

నగరంలోని రహదారుల పాక్షిక మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ప్రజా వినియోగంలోకి తీసుకువస్తున్నామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. నగరంలో వివిధ ప్రాంతాలలో చేపడుతున్న గుంతలు పూడ్చివేత, పాక్షిక మరమ్మతులను ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావసరాలను గుర్తించి ఎప్పటికప్పుడు అవి పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తున్నామన్నారు.

ఆక్రమణలు తొలగింపు

నగరంలో ఆక్రమణలను పట్టణ ప్రణాళిక సిబ్బంది తొలగించారు. దాసన్నపేట, రైతు బజారు, గెడ్డ వీధి ప్రాంతాల్లో కొంతమంది రహదారులను ఆక్రమించి షెడ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టారు. వీటిని క్షేత్రస్థాయి పర్యటనలో కమిషనర్ నల్లనయ్య గమనించి, తొలగించాలని ప్రణాళిక సిబ్బందికి ఆదేశించారు. దీంతో ఆక్రమిత తాత్కాలిక నిర్మాణాలను శనివారం తొలగించారు.

బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బాక్సింగ్ సీనియర్స్ పురుషుల జట్ల ఎంపిక స్థానిక రాజీవ్ స్టేడియంలో నిర్వహించారు. ఇందులో సుమారు 50 మంది పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 విభాగాల్లో 10 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19, 20న పిఠాపురంలో జరిగే 8వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మథ కుమార్, సాప్ బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వర రావు, అసోసియేషన్ సభ్యులు ఎస్ఇ రాజు , సారిక రమణ, రామకృష్ణ, ప్రసాద్, బాక్సింగ్ రింగ్ అఫీషియల్స్ వి.సంతోష్ కుమార్, పి.శ్రీనివాసరావు, సీనియర్ బాక్సర్లు బి.మనీష్, జె.ప్రసాద్, బి.వికాస్ పాల్గొన్నారు.

పోరుదారిలో ప్రజానీకం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఓవైపు పేరుకుపోతున్న ప్రజా సమస్యలు... మరోవైపు ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు... ఇంకోవైపు పిచ్చుకపై బ్రహ్మాస్త్రం లాంటి రాజకీయ వేధింపులు... వెరసి ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజానీకం పోరుబాట పట్టింది. రోడ్లపైకి వచ్చి తమ ఆవేదనను, ఆక్రోశాన్ని తెలియజేస్తున్నారు. ఈ నెల 17న విద్యుత్తు బిల్లులు తగలబెట్టేందుకు కూడా సిద్ధమౌతున్నారు. ఇందులో వామపక్ష పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, వాటి అనుబంధ సంఘాలు మాత్రమే కాదు.., చివరికి ఆర్నెల్ల క్రితం వరకు అధికారంలోకి ఉండి, సమస్యలపై పోరాడిన ప్రజల్ని, నాయకుల్ని నిర్బంధాలు, అక్రమ కేసులకు గురిచేసిన వైసిపి కూడా ప్రజలకు దూరం కాకుండా ఉండేందుకైనా ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. విధాన పరంగా మాత్రం వైసిపి ప్రజాపోరాటాలకు కలిసి రాలేదు సుమా...! ఎందుకంటే గతంలో కేంద్ర ప్రభుత్వం విధానాలను నాటి వైసిపి ప్రభుత్వం అమలు చేసినట్టే, నేడు టిడిపి కూటమి ప్రభుత్వం కూడా అమలుకు కంకణం కట్టుకుంది. అందువల్లే విధానపరమైన వ్యతిరేకతకు వైసిపి ఆమడదూరంలో ఉంటోంది. గడిచిన వారం రోజుల్లో జరిగిన పరిణామాలు ప్రజాపోరాటాలు, విధానపరమైన వైరుధ్యాలు తెలుసుకునేందుకు బోధపడతాయి. ప్రస్తుతం ట్రూఅప్ ఛార్జీలతో విద్యుత్తు భారం పెరిగింది. జనవరిలో మరో దఫా పెంచేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. దీనిపై ఇప్పటికే వామపక్షాలు, ముఖ్యంగా సిపిఎం, ఆ పార్టీ అనుబంధ సంఘాలు శక్తిమేర ప్రజల్ని ఐక్యం చేసి వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. ఇందుకనుగుణమైన పోరాటాలు చేసేందుకు మాత్రం వైసిపి సిద్ధంగా లేదు. ఎందుకంటే గతంలో వైసిపి కూడా విద్యుత్తు ఛార్జీల పెంపునకు అనుగుణమైన సంస్కరణల అమలుకు రాష్ట్రంలో పెద్దపీట వేసిది. ఆ మేరకు ప్రజలపై భారాలు కూడా పడ్డాయి. మరోమాటలో చెప్పాలంటే ఎటువంటి భారమూ వేయబోమంటూ ప్రచారం చేయడం ద్వారా టిడిపి ఇటీవల జరిగిన ఎన్నికల్లో లబ్ధిపొందింది. అందువల్లే విధాన పరమైన అంశాల విషయంలో టిడిపి, వైసిపి దొందూ దొందేనని, ఇంకా చెప్పాలంటే బిజెపి తానులో ముక్కలు వంటివేనని పలువురు విశ్లేషిస్తున్నారు.

ఇక ప్రజా సమస్యల విషయానికి వస్తే... ఎన్నికల్లో గెలిచాక రూ.15 వేల రైతుభరోసాకు బదులు రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని రైతులకు అందిస్తామని టిడిపి నమ్మబలికిన సంగతి తెలిసిందే. అమలుకొచ్చేసరికి మీనమేషాలు లెక్కిస్తోంది. ఈ నేపథ్యంలో ఇరు జిల్లాల్లోనూ వైసిపి ఆధ్వర్యాన నిన్నగాక మొన్న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేపట్టారు. వినతిపత్రాలు ఇచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు ధర్నాలు చేసిన వారిని అవహేళన చేసినట్టుగా నిర్బంధాలు, బెదిరింపులు, అక్రమ కేసులు పెట్టిన వారు సైతం చివరికి ఆందోళనబాట పట్టడం గమనార్హం. ఏదేమైనా ప్రజా సమస్యలపై పోరాడటం మంచి పరిణామమే. కాకుంటే పదవులు, అధికారం శాశ్వతం కాదన్న విషయం తెలుసుకోవాలని అంటున్నవారు కూడా లేకపోలేదు. వీటి సంగతి అటుంచితే, తమకు వేతనాలు పెంచాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సదుపాయాలు కల్పించాలని, భవన సౌకర్యం కల్పించాలని వివిధ తరగతులకు చెందిన ప్రజలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు గడిచిన వారంలో తీవ్ర ఆందోళనలు చేపట్టాయి. ధాన్యం కొనుగోలు చేసి, మద్దతుధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. చిన్నాపురం జ్యూట్ మిల్లు తెరిపించాలంటూ అక్కడి కార్మికులు విజయనగరంలో సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. తమకు రూ.15 వేలు కనీస వేతనం చెల్లించడంతోపాటు మెస్ బిల్లులు ఇవ్వాలని, ఒక్కో విద్యార్థికి రూ.20 చొప్పున మెస్ ఛార్జీలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పోరుబాట పట్టారు. వేతన బకాయి చెల్లించడంతోపాటు తమను ఫుల్‌టైం కార్మికులుగా గుర్తించాలంటూ ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లోని ఆయాలు ఆందోళన చేస్తున్నారు. ఈ నెల 16న కలెక్టరేట్ ఎదుట ధర్నాకు కూడా సన్నద్ధమౌతున్నారు. విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి భవన సదుపాయం కల్పించాలని అక్కడి విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన చాలా కాలంగా పోరాడుతున్న సంగతి తెలిసిందే. తాజాగా వరండాలు చదువులు సాగిస్తూ నిరసన తెలిపారు. ఇదే విషయమై పట్టణ పౌర సంక్షేమ సంఘం సంతకాల సేకరణ చేపట్టింది. కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రీన్ అంబాసిడర్లు ఈ నెల 10న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. రాజకీయ కక్షతో తొలగించిన గజపతినగరం మండలం రామన్నపేట అంగన్‌వాడీ సెంటర్ ఆయా సౌజన్యను విధుల్లోకి తీసుకోవాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆరు రోజులుగా నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. సూపర్ సిక్స్ అమలు చేయలేదంటూ జనం కోడై కూస్తున్నారు. అందులో ఇప్పటికే అమలు చేశామంటున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అరకొరగానే ఉంది. తమ ఖాతాల్లో నగదు బదిలీ జమకావడం లేదంటూ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేయడమే ఇందుకు తార్కాణం. ఇలా సగటు కుటుంబం ప్రభుత్వ పాలనపైనా, రాజకీయ వేధింపులు, కక్ష సాధింపు చర్యలపైనా ప్రభుత్వంపై గుర్రుగా ఉంటోంది.

ప్రశాంతంగా నీటి సంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని ఎంఎన్ ఛానెల్, బివి ఛానెల్ వివిధ చెరువు ఆయకట్టు సంఘాలకు శనివారం ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగాయి. ఈ మేరకు మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఎంఎన్ ఛానెల్ అధ్యక్షునిగా పాకలపాటి సన్యాసి రాజు, బివి ఛానెల్ అధ్యక్షునిగా బుద్దరాజు నారాయణ కృష్ణ వర్మ, గరుడబిల్లి గ్రామంలో గల పాపయ్య చెరువు ఆయకట్టు దారుల అధ్యక్షునిగా బొద్దల అచ్చంనాయుడు, కత్తెర చెరువు ఆయకట్టు దారులు అధ్యక్షునిగా మజ్జి సూరమ్మలు ఏకగ్రీవం అయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎంపిడిఒ జి.గిరిబాల, పంచాయతీ రాజ్ జెఇ పి.అప్పలనాయుడు, సిడిపిఒ డి. ఉమాభారతి ఎన్నికైన అభ్యర్థులకు ధృవ పత్రాలను అందించారు.

భోగాపురం: పోలిపల్లి ఛానల్ అధ్యక్షుడుగా బుగత అప్పలనాయుడు, భోగాపురంని డెంకాడ ఛానల్ సిస్టం-5కు అధ్యక్షులుగా వరుపుల గిరి, సిస్టం-3కి ఆళ్ల ఉదయ బాబు ఎన్నికయ్యారు. ముంజేరు గ్రామంలోని కొండ్రాజు చెరువుకు సంబంధించి అధ్యక్షుడిగా పిడుగు కనకరావు ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి ఎన్నికల అధికారులైన ఉప తహశీల్దార్ సుభాష్, ఇఒపిఆర్‌డి గాయత్రి, సిఎస్‌డిటి మురళి, రీ సర్వే డిటి రవికుమార్ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ ఎన్నికల్లో మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యన్నారాయణ, నాయకులు పల్లి సత్యవతి, శుభోసనరావు, పళ్ళ రాంబాబు, బుగత రామ్మోహనరావు, బొల్లు త్రినాధ్, సరగడ తోబులు రెడ్డి పాల్గొన్నారు.

మెంటాడ: ఆండ్ర, పిట్టాడ, మెంటాడ నీటి సంఘం చైర్మన్‌లుగా టిడిపి అభ్యర్థులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జరిగిన నీటి సంఘ ఎన్నికలలో ఆండ్ర జలాశయం కుడి కాలువ చైర్మన్‌గా పడాల గంగునాయుడు (ఆండ్ర) ఎడమ కాలువ చైర్మన్‌గా రొంగలి రామారావు (పిట్టాడ) వైస్ చైర్మన్‌గా దాసరి శ్రీరాములు (ఆండ్ర), మెంటాడ ఆయకట్టు నీటి సంఘ చైర్మన్‌గా రెడ్డి రాజగోపాల్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నెల్లిమర్ల: మండలంలో 14 నీటి సంఘాలకు కార్యవర్గం ఎన్నిక జరిగినట్లు ఎన్నికల అధికారి వివిఆర్ జగన్నాథరావు తెలిపారు. శనివారం ఆయా గ్రామాల్లో చెరువులు ఆయకట్టుదార్లకు నీటి సంఘం ఎన్నికలు నిర్వహించగా 14నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు ఎన్నికయ్యారని చెప్పారు. గెలిచిన సంఘాలు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులకు తహశీల్దార్ పి. సుదర్శన రావు, ఎన్నికల అధికారి జగన్నాధరావు ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి సురేష్, పాల్గొన్నారు.

మెరకముడిదాం: మండలంలో 15నీటి సంఘాలకు గాను శనివారం 14నీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. గర్భాంలో సభ్యులు లేక ఎన్నిక వాయిదా వేసినట్లు ఇరిగేషన్ ఎఇ కలిశెట్టి లక్ష్మి కాంత్ తెలిపారు. మిగతా ప్రాంతాల్లో ఎన్నిక ప్రశాంతంగా జరిగిందని వెల్లడించారు.

పూసపాటిరేగ: మండలంలోని శనివారం ఎనిమిది నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యాక్షలను ఎన్నుకున్నారు. పాలవలస ఛానల్ అధ్యక్షులుగా రౌతు ఉపేంద్ర ఎన్నికవగా, ఉపాధ్యాక్షులుగా చింతపల్లి వెంకటప్పారావు ఎన్నికయ్యారు. కనిమెల్లలో తిరుమలగెడ్డకు దంతులూరి సత్యనారాయణరాజు, రెడ్డి అప్పలనాయుడు, కందివలస ఊర చెరువుకు పులపా వెంకటప్పారావు, ధర్మారావు, కొవ్వాడ పెద్ద చెరువుకు జామి అప్పలనాయుడు, లెంక సత్యం, పూసపాటిరేగ పెద్ద చెరువుకు కోరాడ ఆదినారాయణ, పాకలపాటి అప్పలనర్సింహరాజు, వెల్దూరు అయ్యప్ప ట్యాంకుకు బాకి తోటయ్య, బొచ్చు అప్పలకొండ, కుమిలి ఛానల్‌కు మహంతి నర్సినాయుడు, బొండా వైకుంటరావు, వెంపడాం పెద్ద చెరువుకు పిన్నింటి సూర్యనారాయణ, పిన్నింటి పెంటయ్య అధ్యక్ష, ఉపాధ్యాక్షులుగా ఎన్నికయ్యారు. ఇందులో పాలవలస ఛానల్ తప్పా మిగతావన్నీ ఏకగ్రీకంగా జరిగాయి.


భోగాపురం: అధ్యక్షులకు ధ్రువపత్రాలను అందిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

రైతులకు ఎమ్మెల్యే అభినందన

రాజాం: రాజాం నియోజకవర్గంలో నీటిసంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన రైతులను ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగునీటి సంఘాలు ఎన్నికల్లో రద్దు చేయడంతో సాగు నీటి వనరుల నిర్వహణ ముందుకు సాగక రైతులు ఇబ్బంది పడ్డారరన్నారు. అనంతరం రాజాం పట్టణంలో ఆర్ఆర్ఆర్ జ్యువెలరీ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు.

గుర్ల: రైతుల సంక్షేమం కోసం నిరంతరం కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి, విశాఖ డైరీ డైరెక్టర్ వి.సన్యాసినాయుడు అన్నారు. మండలంలో 12 సాగునీటి సంఘాలు ఉండగా ఈ ఎన్నికలలో కూటమి పార్టీల సానుభూతిపరులు 10చోట్ల విజయం సాధించారని ఆయన తెలిపారు. గడిగెడ్డ సాగునీటి సంఘానికి జమ్ము సన్యాసి నాయుడు, గూడెం సీత సాగరానికి పొట్నూరు లక్ష్మును నాయుడు, చింతలపేట చింతల చెరువుకు చింతపల్లి సత్యంలు ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఎన్నికయారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు, రైతుల నీటి సంఘం డైరెక్టర్లు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గజపతినగరం: ధ్రువపత్రాన్ని అందుకుంటున్న రాములప్పస్వామి

విజయనగరంకోట: మండలంలోని ద్వారపూడిలో సాగునీటి సంఘం అధ్యక్షులుగా గనివాడ అంజి, ఉపాధ్యక్షులుగా బొద్దల అప్పలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బాడంగి: మండలంలోని నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ముగడ, పాల్తేరులో ఎన్నికల ప్రక్రియను ఎంపిడిఒ రామకృష్ణ పరిశీలించారు.

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట సుబ్బ సాగరం సాగు నీటి సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. టిడిపి మద్దతు దారుడు మంత్రి రాములప్పస్వామి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బాలి ఆదినారాయణ, సభ్యులుగా సారిక గణపతి, రెడ్డి బంగారు నాయుడు, దాసరి రాము, లెంక రాము ఎన్నికయ్యారు. మండలంలో 2 మధ్య, 11 చిన్న తరహా నీటిపారుదల వ్యవస్థలలో 13 మంది అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డెంకాడ: మండలంలో 10 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా అందులో గుణుపూర్ పేట, పెద్ద తాడివాడ నీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ రెండు చోట్ల అనుకున్న టైంకు నామినేషన్లు వేయకపోవడంతో వాయిదా పడినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన ఏడు చోట్ల ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. అన్నిచోట్ల టిడిపి మద్దతుదారులే చైర్మన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వీరిని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు అభినందించారు.

వంగర: మండలంలో 8 సాగునీటి సంఘాల్లో అధ్యక్ష, ఉపాధ్యాక్షులుగా పలువురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అరసాడ ఎంఆర్‌పి అధ్యక్షుడిగా తుమ్మి లక్ష్ము నాయుడు, శివ్వాం ఎన్ఆర్ఎస్‌కు బొక్కేల అప్పలనాయుడు, తలగాం యన్ఆర్ ఎస్‌కు పైల శ్రీనివాసమూర్తి, ఇరువాడకు చౌదరి రాధాకృష్ణ, అరసాడకు దొంతుల దుర్గారావు, కొండ చాకరాపల్లికి వండాన సత్యమనాయుడు, రాజుల గుమ్మడకు ఆలుబిల్లి పార్థసారథి, కింజంగి అధ్యక్షుడిగా వేమిరెడ్డి కామేసు నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని మోనటరింగ్ అధికారి అనిల్ తెలిపారు.

రామభద్రపురం: మండలంలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో టిడిపి సత్తా చూపింది. 5 సంఘాలకు గాను 4 సంఘాలను టిడిపి కైవశం చేసుకోగా ఒక సంఘాన్ని వైసిపి తన ఖాతాలో వేసుకుంది. కొన్ని టీసీలు ఏకగ్రీవం కాగా మరికొన్ని టీసీల్లో ఓటర్లు చేతులెత్తి అభ్యర్థులను ఎన్నుకున్నారు. రామభద్రపురం, కొట్టక్కి పోలింగ్ కేంద్రాల వద్ద స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఎక్కువ స్థానాల్లో వైసిపి అభ్యర్థులు పాల్గొనకపోవడంతో టిడిపి నాయకుల మధ్యే పోటీ ఏర్పడింది. పెద్దగెడ్డ ప్రాజెక్టుకు సంబంధించి కొట్టక్కి నీటి సంఘం అధ్యక్షుడుగా ఎం.జగదీశ్వరరావును, రామభద్రపురం డబ్ల్యు 6కు సంబంధించి చెందిన పూడి రామినాయుడును ఎన్నుకున్నారు. కొండకెంగువ ఏడొంపులగెడ్డ సాగునీటి సంఘానికి తాడ్డి శ్రీనివాసరావు పాతరేగ ఎర్రిగెడ్డ కు పెద్దింటి పైడిపునాయుడు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు.

బొబ్బిలి: మున్సిపాలిటీ, మండలంలో ఉన్న 18 సాగునీటి సంఘాలలో 17 సాగునీటి సంఘాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మున్సిపాలిటీలోని గొల్లపల్లి, పాతబొబ్బిలి సాగునీటి సంఘాలు ఎన్నిక ఏకగ్రీవం అయింది. మండలంలోని గోపాలరాయుడుపేట, అలజంగి, పారాది, కలవరాయి, కృష్ణాపురం, ఎ. వెలగవలసలో ఒకొక్క సాగునీటి సంఘం ఎన్నిక ఏకగ్రీవం కాగా పిరిడిలో మూడు, పక్కిలో రెండు సాగునీటి సంఘాలు ఏకగ్రీవం అయ్యాయి. చింతాడలో రెండు సంఘాలు ఉండగా ఒకటి ఏకగ్రీవం కాగా ఒక సంఘం ఎన్నిక వాయిదా పడింది. చింతాడ నరసప్ప చెరువు సంఘం ఎన్నికకు పోటీ చేసేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో అధికారులు వాయిదా వేశారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎక్కువ సంఘాలలో అధికార పార్టీ సభ్యులు ఎన్నికయ్యారు.

ఖండ్యాం నీటి సంఘం ఎన్నికల్లో వాగ్వివాదం

రేగిడి: మండలంలోని 39 గ్రామపంచాయతీలో 106 నీటి సంఘం ఎన్నికలకు సంబంధించి 14 పోలింగ్ కేంద్రాలలో శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఖండ్యాం నీటి సంఘం ఎన్నికల్లో పుర్లి నీటి సంఘానికి సంబంధించి పాలవలస ప్రసాద్, యెర్నేన రామినాయుడు మద్దతుదారుల మధ్య స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. వీరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. స్థానిక మహిళా పోలీస్ రేగిడి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నీలావతి సిబ్బందితో పోలింగ్ కేంద్రానికి చేరుకొని మద్దతు దారులను చెదరగొట్టారు. పాలవలస ప్రసాద్‌కు107 ఓట్లు రాగ, తన సమీప అభ్యర్థి ఎర్నేన రామినాయుడుకు 104 ఓట్లు వచ్చాయి. వైసిపి, జనసేన మద్దతుదారులతో మూడు ఓట్లతో పాలవలస ప్రసాద్ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ఎఇ శంకర్ రావు తెలిపారు. టిడిపి నాయకులు దూబ ధర్మారావు, కె. మహేశ్వరరావు చేరుకొని రీకౌంటింగ్‌కు డిమాండ్ చేశారు. అయినా ఫలితం లేదు. దేవుదళ నీటి సంఘానికి టిడిపి, జనసేన, బిజెపి మద్దతుదారులతో పాలవలస కృష్ణంనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 106 టీసీలకు సంబంధించి పుర్లి టిసికి ఎన్నికల కాగా, మిగతా అన్నిచోట్ల ఏకగ్రీవంగా నీటి సంఘం అధ్యక్షులను ఎన్నుకున్నట్లు ఆయా ఎన్నికల అధికారులు తెలిపారు.

మూడు గ్రామాల్లో నిలిచిన నీటి సంఘం ఎన్నికలు

వేపాడ: మండలంలో శనివారం నిర్వహించిన నీటి సంఘాలు ఎన్నికలు వల్లంపూడి, నల్లబెల్లి, కేజీ పూడి గ్రామాలలో అధికార పార్టీ గ్రూపు తగాదాల వల్ల నిలిచిపోయాయి. బానాది, పాటూరు, బొద్దాం, వీలుపర్తి గ్రామాలలో పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, తహశీల్దార్ జె రాములమ్మ, పిఆర్ జెఇ ఆలీ, వల్లంపూడి ఎస్ఐ బి. దేవి, ఎఇ యశ్వంత్ కుమార్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించినట్లు ఇరిగేషన్ ఎఇ ఎం హేమ్ కుమార్ తెలిపారు.

జామిలో నాలుగుచోట్ల నిలిచిన ఎన్నికలు

జామి: మండలంలో నీటి సంఘం ఎన్నికల్లో గంధరగోళం నెలకొంది. 14 మైనర్, 4 మీడియం చెరువులకు ఎన్నికలు నిర్వాహించాల్సి ఉండగా, జామి, చింతాడ, శాసనాపల్లి గ్రామాల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. జామి, చింతాడ గ్రామాల్లో టిడిపి, వైసిపి నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకొంది. 14 మీడియం చెరువులు ఉన్న నాలుగు చోట్ల ఏకగ్రీవంగా ఎన్నికలు ముగిశాయి. 14 మైనర్ చెరువుల్లో దాదాపుగా గొడవలు జరిగాయి. అధికార పార్టీ ఒత్తిళ్ళ వల్లనే ఎన్నికలు నిలిచిపోయాయని ప్రతి పక్ష పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు.

వేపాడ: ధ్రువపత్రాన్ని అందిస్తున్న ఎన్నికల అధికారి

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని తంగుడిబిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రంతో పాటు రెండవ శనివారం, ఆదివారాలలో కూడా ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. డిఇఒ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలో వందరోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని గణిత ఉపాధ్యాయులు శివుకు బంగారయ్య తెలిపారు. సెలవు రోజుల్లో పదవ తరగతి విద్యార్థులకు ప్రైవేట్ క్లాసులు నిర్వహిస్తూ గణితంలో శత శాతం ఫలితాలు కోసం కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఇటీవల ఎంఇఒ చేతుల మీదుగా విద్యార్థులకు గణితదీప్తి స్టడీ మెటీరియల్స్‌ను ఉచితంగా పంపిణీ చేసినట్లు గణిత ఉపాధ్యాయులు బంగారయ్య తెలిపారు.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న బంగారయ్య

లారీలకు జరిమానా

బొబ్బిలి: పరిమితికి మించి లోడ్‌తో వెళ్తున్న రెండు లారీలను పోలీసులు పట్టుకుని జరిమానా విధించారు. విశాఖపట్నం నుంచి గ్రోత్ సెంటర్‌కు సిలికామాంగనీసు లోడ్ తో వస్తున్న లారీలు పరిమితికి మించి లోడ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించడంతో ఎంవిఐ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి ఒకొక్క లారీకు రూ.30వేలు చొప్పున జరిమానా విధించారు. రాయగడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఇసుక లారీని పట్టుకుని అధిక లోడ్ తో వెళ్తున్నట్లు గుర్తించి రూ.54వేలు జరిమానా విధించారు. ఎంవిఐ ఆదేశాలు మేరకు జరిమానా విధించామని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ చెప్పారు. వాహన నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి వద్ద శారద కంపెనీ ఆధ్వర్యంలో శనివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. 300 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోవింద, డాక్టర్ కార్తీక్, డాక్టర్ కృష్ణ మూర్తి, డాక్టర్ ఎండీ కలిమ్, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ వెంకట్రావు పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద మదిన అప్పలరాం, ఎం. కాశీవిశ్వనాథరావు, మాజీ సర్పంచ్ ఎస్. వెంకటరమణ, శారదా మెటల్స్ అండ్ అల్లోస్ లిమిటెట్ ఎజిఎం మనోజ్ కుమార్, హెచ్ఆర్ మేనేజర్ ప్రదీప్ కుమార్, హెచ్ఆర్ అసిస్టెంట్ మేనేజర్ శంకర్రావు, సీనియర్ మేనేజర్ హెచ్ పద్మాకర్, సంతోష్ కుమార్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి

బొబ్బిలి రూరల్: అదాని స్మార్ట్ మీటర్లను ఆదిలోనే అడ్డుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం ప్రజలను కోరారు. అదాని స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని, ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని కోరుతూ శనివారం రంగారాయపురంలో ప్రచారం చేసి గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదాని స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే రీఛార్జ్ చేసుకుని విద్యుత్ వాడుకోవాలన్నారు. ట్రూ అప్ ఛార్జీల భారం విద్యుత్ వినియోగదారులపై రూ.16వేల కోట్లు వేయడం దుర్మార్గమన్నారు. ఈ రెండింటికీ వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యు.ప్రసాద్, ప్రజలు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపు కోట: మండలంలోని కాపు సోంపురం గ్రామంలోని ఎఎస్ఆర్ గార్డెన్స్‌లో శనివారం ఎస్.కోట మండల పాస్టర్స్ ఫెలోషిప్ నిర్వహించిన ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పాల్గొన్నారు. ఆమెను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు అనకాపల్లి చెల్లయ్య, పాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

పూసపాటిరేగ: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 16వ తేదీన కలెక్టరేట్ వద్ద జరగబోయే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు కార్యదర్శి బచ్చల సూర్యనారాయణ కోరారు. పూసపాటిరేగలో శనివారం ఆయన కరపత్రం విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల నిత్యవసర సరుకులు ధరలు పెరిగాయని, అవసరాలు పెరిగాయని, విద్య, వైద్యం ఖర్చులతో పాటు కూరగాయలు ధరలు పెరిగాయని అన్నారు. దీనికి తోడు 2019 తర్వాత ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఏ ప్రభుత్వం జీతం పెంచడం లేదని, కేవలం రోజుకు వంద రూపాయలు చొప్పున నెలకు 3000 రూపాయలు జీతంతో పనిచేస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఆలోచించి మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు పదివేల రూపాయలు జీతం చెల్లించాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పిల్లల మెనూ చార్జీ పెంచాలన్నటు వంటి డిమాండ్లతో ఈ నెల 16న ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డి.కంచమ్మ డి.నాగమణి, సన్యాసమ్మ మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు

మానసిక, శారీరక వికాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి- డెంకాడ

మానసిక, శారీరక వికాశానికి క్రీడలు దోహదపడతాయని జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ అన్నారు. శనివారం చింతలవలస సమీపంలోని 5వ బెటాలియన్ ఎపిఎస్‌పి పరేడ్ గ్రౌండులో 36వ వార్షిక పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ వార్షిక క్రీడా పోటీల్లో 5వ బెటాలియన్ వివిధ కంపెనీలకు చెందిన తొమ్మిది జట్లు పాల్గొని, తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించనున్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ మావోయిస్టులు, తీవ్రవాదులతో పోరాటం చేయడంలో బెటాలియన్‌కు ఘనమైన చరిత్ర ఉందన్నారు. బెటాలియన్ పోలీసులు సాధించిన కృషి ఫలితంగా నేడు మనందరం సురక్షితంగా జీవించగలుగుతున్నామన్నారు. ఈ బెటాలియన్‌లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందిలో స్ఫూర్తిని నింపేందుకు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించుకుంటున్నామన్నారు. విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొంటున్న తీవ్రమైన పని, మానసిక ఒత్తిడి, కాలాతీతంగా పని చేయడం, సమయానికి భోజనం చేయని కారణంగా ఆరోగ్యంపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించలేక రిటైరయ్యే సమయానికి అనారోగ్యం పాలవుతున్నామన్నారు. ఈ స్పోర్ట్సు మీట్ పోలీసు సిబ్బందిలో స్ఫూర్తి నింపడంతోపాటు, ఒక మంచి ఆరోగ్యకరమైన వాతావరణంలో పని చేయడం, శారీరక సామర్థ్యాన్ని, మానసిక ఆనందాన్ని మెరుగుపర్చుకోవడానికి, ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పరుచుకోవ డానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పోటీతత్వాన్ని, ఓటమి నుండి గెలుపునకు అవసరమైన సమిష్టితత్వంను పెంచేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్ మాట్లాడుతూ పోలీసులు విధుల నుంచి ఉపశమనం కల్పించేందుకు సంవత్సరాంతంలో ప్రతీ బెటాలియన్, పోలీసు యూనిట్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహించుకోవడం ఒక మంచి సంప్రదాయంగా వస్తుందన్నారు. బెటాలియన్ పోలీసులు వేరు వేరు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తుంటారని, ఈ క్రీడల కారణంగా అందరూ ఒక చోటకు చేరుకొని, సమిష్టిగా కలిసి పని చేసేందుకు తగిన స్ఫూర్తిని మనకు అందిస్తాయని అన్నారు. ప్రారంభం రోజున నిర్వహించిన 800 మీటర్లు పరుగు పందెం, షాట్‌పుట్, జావెలిన్ త్రో, బాస్కెట్ బాల్, క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన పోలీసు సిబ్బంది, జట్లకు జిల్లా ఎస్పి వకుల్ జిందల్, కమాండెంట్ మల్లికా గార్గ్ మెడల్స్, జ్ఞాపికలను, సర్టిఫికేట్స్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమాండెంట్ బాపూజీరావు, రమణమూర్తి, శ్రీనివాస్, గోపాలకృష్ణ, రిజర్వ ఇన్‌స్పెక్టర్లు జి.రవీంద్ర, ఎం.శ్రీనివాసరావు, దానయ్య, నూకరాజు, దామోదర్, కెకెఎం.రాజు, కేశవరావు, చంద్రమోహన్, ఎ.శ్రీనివాసరావు, సుధాకర్ బాబు, చంద్రశేఖర్, సమర్పణ రావు, ఎన్.గణేష్, ఎఒ శోభారాణి, పలువురు ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పి వకుల్ జిందాల్

బహుమతులను ప్రదానం చేస్తున్న ఎస్పి వకుల్ జిందాల్

విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మెంటాడ

స్థానిక ఎస్‌సి కాలనీకి చెందిన డిగ్రీ విద్యార్థి ఏల కృష్ణవేణి గత కొన్నాళ్లుగా వింత వ్యాధితో బాధ పడుతోంది. వైద్యులకు కూడా అంతుచిక్కని వ్యాధితో బాధ పడుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన కృష్ణవేణి ఆర్థిక పరిస్థితి బాగోలేదని గుర్తించిన మెంటాడ యూత్ తలో చేయి వేసి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1.46లక్షల ఆర్థిక సాయాన్ని పోగు చేసి శనివారం కృష్ణవేణికి అందించారు. కృష్ణ వేణి తండ్రి కృష్ణ కొన్నాళ్ల క్రితం చనిపోయాడు. తల్లి లక్ష్మి రోజువారీ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తుంది. ఇంతలో పేదింటి పై పెద్ద కష్టం వచ్చి పడింది. కదల్లేని కూతురుని చేసి తల్లడిల్లిపోతున్న తల్లి బాధను గుర్తించిన మెంటాడ యూత్ ఆమెను ఆదుకునేందుకు ముందుకు వచ్చి సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మెంటాడ యూత్ సభ్యులు కొల్లా భరత్, వెంపడాపు ప్రసాదరావు, మండల విజయ్ కుమార్, రాజేష్, విశ్వేశ్వరరావు, పాండ్రంకి చిరంజీవి, ఆది తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 714 కేసులు రాజీ

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 714 కేసులను రాజీ చేశారు. సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్య జోసెఫైన్ రెండు బెంచీలలో లోక్ అదాలత్ నిర్వహించి కక్షిదారులను విచారించి కేసులను పరిష్కరించారు. ప్రోనోట్ సివిల్ కేసులు 5, టైటిల్ సివిల్ కేసులు 3, ఇపి 4, పిలుపు దావా ఒకటి, చెక్ బౌన్స్ 4, మనోవర్తి ఒకటి, ఐపిసి కేసులు 36, ఎక్సైజ్ కేసులు 67, ఎస్టిసి కేసులు 593 పరిష్కరించారు. సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్ ఎంతో దోహదం చేస్తుందని న్యాయ మూర్తులు అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.మోహన్ మురళీకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 392 కేసులు పరిష్కారం

శృంగవరపుకోట : ఎస్‌కోట జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ కుమారి సబ్బవరపు వాణి అధ్యక్షతన స్థానిక కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. లోక్ అదాలత్ ద్వారా మొత్తం 392 కేసులను రాజీ పరిష్కారం చేశారు. వీటిలో సివిల్ కేసులు 4, చెక్ బౌన్స్ కేసులు 2, మనోవర్తి కేసు 1, ఎక్సైజ్ కేసులు 44 , బ్యాంకు ప్రీ లిటిగేషన్ కేసులు 15, క్రిమినల్ కేసులు 326 మొత్తంగా 392 కేసులను న్యాయమూర్తి వాణి రాజీ పరిష్కారం చేశారు. రాజీయే రాజమార్గమని, రాజీ అవదగ్గ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవడం ఉత్తమమని కక్షిదారులకు న్యాయమూర్తి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు బి.సత్యనారాయణ, జి.చిట్టిబాబు, శృంగవరపుకోట న్యాయవాదుల సంఘం అధ్యక్షులు జి. సూరిదేముడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బొబ్బిలి: కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జిలు

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్ కోట మండల మహాసభ నూతన అధ్యక్ష కార్యదర్శులను శనివారం ఎన్నుకున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తూ, విద్యార్థుల సమస్యలు పరిస్కారం కోసం విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ నిరంతరం పోరాటలు చేస్తుందన్నారు. విద్యార్థులు చదుతో పాటు సమాజ పరిస్థితులు కూడా అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా విద్యారంగంలో ఎటువంటి మార్పులూ రాలేదన్నారు. సుమారు రెండు సంవత్సరాలుగా విద్యార్థులకు అందవలసిన స్కాలర్షిప్స్ అందడం లేదన్నారు. సంక్షేమ హాస్టల్ సమస్యలు, ప్రభుత్వ డిగ్రీ జూనియర్ కాలేజీ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులే ఈ ప్రభుత్వం కూడా చేస్తుందని చెప్పారు. నూతనంగా ఎన్నికైన మండల కమిటీలు చురుగ్గా పనిచేయాలని సూచించారు. మండల మహాసభలో ఎస్ఎఫ్ఐ ఎస్ కోట మండల కార్యదర్శిగా కె రమేష్, అధ్యక్షులుగా చైతన్య, మండల గర్ల్స్ కన్వీనర్‌గా అను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కో కన్వీనర్ సమీరా, మండల కమిటీ సభ్యులు పి.రత్న, వి.చరణ్, జిల్లా కమిటీ సభ్యులు భారతి, ఇంద్ర, నాగరాజు, శీల, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

అనుమతి లేకపోయినా ప్రారంభించారు..

అనుమతులు లేని భవనం ఇదే..

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో మొయిద జంక్షన్ సమీపంలో అనుమతి లేకుండా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాన్ని ప్రారంభించారు. నెల్లిమర్ల సినిమా హల్ ఆవరణలో ఎస్3 కన్వెన్షన్ 6 అంతస్థుల భవనం అనుమతి లేకుండా కట్టినట్లు గుర్తించిన అధికార్లు నోటీసులు జారీ చేశారు. స్పందించకపోవడంతో సదరు భవనంపై కోర్టులో కేసు వేసినట్లు సమాచారం. అయినప్పటికి కేసులు మమ్మల్ని ఏమి చేస్తాయి, అధికార్లు మా చేతిలో ఉన్నారని యజమాని కూటమి నాయకులతో కొత్తగా కట్టిన బహుళ అంతస్థుల భవనాన్ని అట్టహాసంగా ప్రారంభించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, చట్టాలు సామాన్య ప్రజలకే తప్ప బడా బాబులకు వర్తించావా అని ప్రశ్నిస్తున్నారు. గతంలో పేదవారు ఎక్కడైనా ఇళు ్ళ కట్టుకుంటే అనుమతి లేదని అడ్డుకున్న నగర పంచాయతీ అధికార్లు బడా బాబులు అక్రమంగా నిర్మాణాలు జరిపితే చూసి చూడనట్లు వ్యవహరించి వారికి వత్తాసు పలికి మొక్కు బడిగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శిస్తున్నారు. కాగా బహుళ అంతస్తుల భవనానికి అనుమతులు లేకుండా నిర్మించారని పలువురు కౌన్సిలర్లు ఫిర్యాదు కూడా చేశారు. బహుళ అంతస్థుల భవన నిర్మాణంలో వేలాది రూపాయలు చేతులు మారాయని అందుకే అధికార్లు కూడా పట్టించుకోలేదని విమర్శలు వినవస్తున్నాయి. బహుళ అంతస్తుల భవనం సమీపంలో సచివాలయం ఉన్నప్పటికి మాకెందుకులే అన్న చందంగా సిబ్బంది వ్యవహరించడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. గత ప్రభుత్వంలో అనుమతి లేకుండా నిర్మాణం జరిపిన భవనం ఇప్పుడు కూటమి ప్రభుత్వం మద్దతు పలకడం అధికార, ప్రతిపక్షాలు రెండు ఒకటిగా కలిసి బడా బాబుల పక్షనా ఉంటాయని భవనం ప్రారంభతో తేట తెల్లమైందిని స్థానికులు చర్చించుకుంటున్నారు. అనుమతులు లేని భవన యజమానులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
O.S. 21/2023

Between:
State Bank of India RTC Complex Branch represented by it branch manager, Sri. K Koteswara Rao S/o Appala Naidu ....Plaintiff

And:
KOTHAPALII VARA PRASADA RAO ...Defendant

NOTICE

Defendant:
KOTHAPALII VARA PRASADA RAO (Borrower), S/o Simhachalam, House no 2-260, Jaddeti valasa, Jami Mandal, Vizianagaram 8374702289.

Hearing Date: 20-12-2024

Please take notice that the above matter is posted to **20-12-2024.** You shall appear in person or through your Advocate, by **10.30 AM,** failing which the matter will be decided Ex-Party.

PVS Prasad
Advocate for the Plaintiff
Vizianagaram.
Cell: 7799955633

IN THE HONOURABLE COURT OF THE III ADDITIONAL JUNIORCIVIL JUDGE (EXCISE) AT VIZIANGARAM.
O.S. No. 587/2023.

Between:
CANARA Bank, (Syndicate Bank merged in Canara Bank on 01-04-2020) |Ring Road Branch, Vizianagaram. .... Plaintiff

And:
1) M/s Loyal Food and Beverages, represented by its proprietor Duppala Sudheer and another ....Defendants

NOTICE TO DEFENDANT No. 1& 2

1) M/s Loyal Food and Beverages, represented by its proprietor Duppala Sudheer, S/o Stalin, D.No.20-20-1, Near Sai Baba Temple, Beside HP petrol Bunk, Ring Road, Vizianagaram Municipal Corporation and Vizianagaram District.

2) Duppala Sudeer, S/o Stalin, Prop: of Loyal Food and Beverages, D.No.20-20-1, Near Sai Baba Temple, Beside HP petrol Bunk, Ring Road, Vizianagaram Municipal Corporation and Vizianagaram District.

Hearing date:20-12-2024

పైన తెలిపిన కేసులో ప్లయింటిఫ్ మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు కేసులో పైకోర్టు వారి నుండి మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తము శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారము పైనెంబర్ కేసు తే 20-12-2024 దిన వాయిదా వున్నదని ఈ పత్రికముఖంగా తెలియపరుస్తూ సదరు తేది అనగా **తే 20-12-2024 దిన ఉదయం గం. 10.30 నిమిషాల**కు మీరు కానీ లేదా మీ తరపున వకీలు గారి ద్వారా కానీ పైకోర్టులో ప్రత్యక్షంగా హాజరు అయి మీతరపున వాదనలు విన్నవించుకోవలెను. లేని యెడల పైన తెలిపిన కేసులో మీ పరోక్షమున విచారించి తీర్మాణించెదరని శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారము ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

// BY THE ORDER OF THE HONOURABLE COURT//

ఇట్లు
సంఘంరెడ్డి మధుసూధనరావు,
ప్లయింటిఫ్ తరపున న్యాయవాది
విజయనగరం, Cell:9440163944